ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 307
సోమవారం 12 మే 2025 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పనున్న కోహ్లీ

బీసీసీఐకి సమాచారం ఇచ్చిన స్టార్ బ్యాటర్? నేడో రేపో అధికారిక ప్రకటన


07

## పాక్‌కు భారీ నష్టం

35-40 మంది సైనికుల మృతి..

100 మందికి పైగా ఉగ్రవాదులు హతం

- ఉగ్రవాదుల ఏరివేత, సూత్రధారుల ఊచకోతే
- లక్ష్యాలుగా ఆపరేషన్ సిందూర్.. వాటిని సాధించాం
- దుస్సాహసాలకుపాల్పడితే భారీ మూల్యం తప్పదు
- మీడియా సమావేశంలో డీజీఎంవో రాఘవ్ ఘయ్
- యుద్ధంలో నష్టాలూభాగమే.. మన పైలట్లు తిరిగొచ్చారు
- డీజీఏవో ఎయిర్ మార్షల్ ఏకే భార్తీ వ్యాఖ్యలు
- పాక్ విమానాలు కొన్ని కచ్చితంగా కూలాయని స్పష్టీకరణ
- కరాచీ సహా.. భూమ్మీద, సముద్రంలో ఎంపిక
- చేసిన లక్ష్యాలపై దాడికి అరేబియా సంద్రంలో యుద్ధనౌకలు
- పాక్ నేవీ హార్బర్‌కే పరిమితమైంది: వైస్ అడ్మిరల్ ప్రమోద్





**న్యూఢిల్లీ, రోమింగ్ న్యూస్:** ఏ లక్ష్యాలను ఉద్దేశించి 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టామో వాటిని సాధించామని మన త్రివిధ దళాల అధికారులు తెలిపారు. అత్యంత అధునాతనమైన సాంకేతికతతో కూడిన పాక్ యుద్ధవిమానాలను కూల్చేయడం, ఆ దేశ రాజధాని ఇస్లామాబాద్‌కు సమీపంలో ఉన్నవాటితో సహా పలు కీలక సైనిక స్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా పాకిస్థాన్‌కు భారీ నష్టం చేకూర్చామని వారు వెల్లడించారు. డైరెక్టర్ జనరల్

మిగతా 2 లో

## పుల్వామా ఉగ్రదాడి మా పనే


- 2019 నాటి దాడి పాకిస్థాన్ 'వ్యూహాత్మక ప్రతిభ'
- మా దేశ రక్షణలో రాజీలేదు:
- పాక్ ఎయిర్ వైస్ మార్షల్ అహ్మద్
- మరోసారి బయటపడ్డ దాయాది కపట నాటకాలు


02


02

## కశ్మీర్‌పై ట్రంప్ అత్యుత్సాహం

- ఆఫర్‌ను తోసిపుచ్చిన భారత్..
- పీవోకేను అప్పగించడంపైనే
- మాట్లాడతామని స్పష్టీకరణ
- ట్రంప్ ఆఫర్‌ను
- స్వాగతించిన పాక్



# మాపై దాడి జరిగితే.. తీవ్రంగా స్పందిస్తాం

- పీవోకేను తిరిగి ఇవ్వాల్సిందే..
- ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాలి
- ఇవి జరిగితేనే పాకిస్థాన్‌తో చర్చలు
- మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అక్కర్లేదు
- అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్‌కు మోదీ స్పష్టం
- చేసినట్లు సీఎన్ఎన్, ఇండియాటుడే కథనాలు
- ఇంటెలిజెన్స్ హెచ్చరికలతోనే మోదీకి వాన్స్ ఫోన్
- వైట్‌హౌస్ వర్గాలను ఉటంకించిన సీఎన్ఎన్
- ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించిన మోదీ
- పాక్ నుంచి బుల్లెట్లొస్తే శతఘ్నులతో బదులు!
- కాల్పుల విరమణ ఉల్లంఘన జరిగితే
- ఆర్మీ చీఫ్‌కు సర్వాధికారాలు ఇస్తూ ఆదేశాలు

03



పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను భారత్‌కు తిరిగి ఇవ్వాల్సిందేనని.. చర్చలకు ఇదే ప్రధానమని ప్రధాని మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తేల్చిచెప్పినట్లు తెలిసింది. పాకిస్థాన్ తమకు ఉగ్రవాదులను అప్పగించాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం.



## కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడమేంటి

- పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించండి
- ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ అవసరం
- ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ, ఖర్గే లేఖలు

## ఎప్‌సెట్‌లో అబ్బాయిల హవా

### ఇంజనీరింగ్‌లో టాప్-10 ర్యాంకర్లంతా వారే

- మొదటి మూడు ర్యాంకులూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే
- టాపర్‌గా భరత్‌చంద్ర.. రామచరణ్‌రెడ్డికి రెండో ర్యాంకు
- అగ్రికల్చర్, ఫార్మసీలోనూ టాప్-10లో 9 మంది బాలురే
- హైదరాబాద్ విద్యార్థి సాకేత్‌రెడ్డికి టాప్‌ర్యాంక్
- తెలంగాణ ఎప్‌సెట్-2025 ఫలితాల విడుదల



03

ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఎప్‌సెట్-2025లో అబ్బాయిలు సత్తా చాటారు. ఇంజనీరింగ్‌లో టాప్-10 ర్యాంకుల్లో అంతా బాలురే నిలిచారు. అగ్రికల్చర్, ఫార్మసీలోనూ టాప్-10లో తొమ్మిది ర్యాంకులను వారు కైవసం చేసుకున్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసం లో ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేశారు.


03

## అమరుడా ఇక సెలవ్

ప్రభుత్వ లాంఛనాలతో అగ్నివీర్ మురళీ నాయక్‌కు అంత్యక్రియలు

- తరలివచ్చిన వేలాది జనం..
- అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు
- ఉప్పొంగిన భావోద్వేగం.. అమర్ రహే
- అంటూ మిన్నంటిన నినాదాలు
- పార్థివ దేహానికి పవన్ ఘన నివాళి
- కుటుంబానికి అండగా ఉంటామని
- సీఎం చంద్రబాబు భరోసా

## సీఎం ఇంటి నుంచి పోటీ పరీక్షల ఫలితాలా?

స్వతంత్ర దేశ చరిత్రలో ఇదే మొదటిసారి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంభావానికి నిదర్శనం

మాజీ మంత్రి హరీశ్‌రావు


03

## నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

- వచ్చే నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- అధిక రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియామకం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్,రోమింగ్ న్యూస్:** రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించిన స్లాట్ బుకింగ్ విధానం సోమవారం(12వ తేదీ) నుంచి

మిగతా 3 లో

## ఈటల వ్యాఖ్యలు సరి కాదు

ఆ నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదు: రంగనాథ్


03

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 మే 2025



# కశ్మీర్‌పై ట్రంప్ అత్యుత్సాహం

**ఆఫర్‌ను తోసిపుచ్చిన భారత్..**

**పీవోకేను అప్పగించడంపైనే మాట్లాడతామని స్పష్టీకరణ**

**ట్రంప్ ఆఫర్‌ను స్వాగతించిన పాక్**



**న్యూఢిల్లీ, మే11:** ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధాన్ని ఆపలేకపోయారు.. ఇజ్రాయెల్-హమాస్ మధ్య శాంతిని నెలకొల్పడంలోనూ విఫలమయ్యారు.. కానీ భారత్-పాక్ మధ్య పెద్దన్న పాత్ర పోషించి కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సిద్ధమైపోయారు. అయితే ట్రంప్ ఆఫర్‌ను భారత్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాత్రం ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని స్వాగతించడంతోపాటు ఈ విషయంలో చొరవ చూపుతున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందని ప్రకటించుకున్న ట్రంప్.. కశ్మీర్ అంశంపైనా అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ విషయమె భారత్, పాక్‌తో కలిసి పని చేస్తామని తన ట్రూత్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో శనివారం పోస్టు చేశారు. 'ప్రస్తుత సంఘర్షణలతో మరణాలు, విధ్వంసం తప్ప ఏ ప్రయోజనం ఉండదని భారత్, పాక్‌లోని బలమైన, శక్తిమంతమైన నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉంది. కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకోవడంలో అమెరికా మీకు సాయం చేయగలిగినందుకు గర్విస్తున్నాను. కశ్మీర్ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవడంలో మీతో కలిసి పనిచేస్తా' అని ఆ పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. కాగా, రెండు దేశాల మధ్య శాంతిని నెలకొల్పడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలను పాక్ ప్రధాని ప్రశంసించారు. అయితే కాల్పుల విరమణకు పాక్ డీజీఎంవో ప్రతిపాదన చేశారని, ఇందులో మరొకరి పాత్రలేదని భారత్ పేర్కొంది. కశ్మీర్ విషయంలో ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదని స్పష్టంచేసింది. 'కశ్మీర్ విషయంలో మాకు స్పష్టమైన వైఖరి ఉంది. పీవోకేను తిరిగి అప్పగించడం ఒక్కటే మిగిలి ఉంది. ఈ విషయంలో ఇంతకుమించి మాట్లాడటానికి ఏంలేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే... మేం మాట్లాడతాం. మరో విషయంపై మాట్లాడే ఉద్దేశం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వం కోరుకోవడంలేదు. ఆ అవసరమూ లేదు'అని ప్రభుత్వవర్గాలు పేర్కొన్నాయి.

# కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడమేంటి

**పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించండి**

**ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ అవసరం**

**ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ, ఖర్గే లేఖలు**



**న్యూఢిల్లీ, మే 11 :** భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై రెండు దేశాల కన్నా ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ ఒప్పందం, ట్రంప్ ప్రకటన తదితర అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు ఆదివారం ప్రధాని మోదీకి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ఖర్గే లేఖలు రాశారు. "పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలనే ప్రతిపక్షాల ఏకగ్రీవ అభ్యర్థనను నేను పునరుద్ఘాటిస్తున్నాను. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌తోపాటు కాల్పుల విరమణను తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంపై పార్లమెంట్‌లో చర్చించాల్సిన అవసరం ఉంది. రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు మన సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశం" అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, కశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ తెలిపారు. కశ్మీర్ సమస్య భారత్, పాకిస్థాన్ దేశాలకు సంబంధించినది మాత్రమేనని చెప్పే బీజేపీ ప్రభుత్వం.. మూడో దేశమైన అమెరికా మధ్యవర్తిత్వాన్ని ఎలా అంగీకరించిందని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ షరతులు ఏంటో దేశ ప్రజలకు చెప్పాలన్నారు. మరోవైపు పాకిస్థాన్‌తో చోటుచేసుకున్న పరిణామాలను వివరించేందుకు ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ కోరారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

# సీఎం ఇంటి నుంచి పోటీ పరీక్షల ఫలితాలా?

**స్వతంత్ర దేశ చరిత్రలో ఇదే మొదటిసారి**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంభావానికి నిదర్శనం**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**



**హైదరాబాద్, మే 11 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేయడం.. ఆయన అహంభావానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 77 ఏండ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా వ్యవహరించలేదని ధ్వజమెత్తారు. పరిపాలనపై, విద్యార్థులపై ఆయనకున్న చులకనభావాన్ని ఇది తెలియజేస్తుందని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సెక్రటేరియట్ ముఖం చూడకుండా కంట్రోల్ కమాండ్ సెంటర్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్ నుంచి పాలన కొనసాగిస్తున్న సీఎం ఇటు పోలీసులు అటు అధికారులను పనిచేసుకోనివ్వడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన అంటే ఇదేనా? అని నిలదీశారు. ఎప్‌సెట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

# పాక్‌కు భారీ నష్టం

మొదటి పేజీ తరువాయి

ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్ (డీజీఏవో) ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భార్తీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ఆపరేషన్స్ వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్, మేజర్ జనరల్ ఎస్ఎస్ శారద.. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. అనంతరం భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాక్ చేసిన దాడులను ఎలా తిప్పికొట్టిందీ వివరించారు. "చొరబాటుదారులను, ఉగ్రవాదులను, ఉగ్రదాడుల వెనుక సూత్రధారులను శిక్షించడం, వారి స్థావరాలను ధ్వంసం చేయాలన్న స్పష్టమైన సైనిక లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్‌ను రూపొందించాం" అని డీజీఎంవో రాజీవ్ ఘయ్ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాక్, పీవోకేలోని తొమ్మిది కీలక ఉగ్రస్థావరాలను గుర్తించి.. వాటిపై అత్యంత కచ్చితమైన దాడులు నిర్వహించామని..

ఐసీ 814 విమానం హైజాక్, పుల్వామా దాడి వంటివాటికి పాల్పడిన యూసుఫ్ అజర్, అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదసిర్ అహ్మద్ తదితర 100 మందికిపైగా పాకిస్థానీ ఉగ్రవాదులు ఈ ఆపరేషన్‌లో హతమయ్యారని ఆయన తెలిపారు.

తాము గుర్తించిన ఉగ్ర క్యాంపుల్లో కొన్నింటిని.. ఉగ్రవాదులు అప్పటికే భయంతో ఖాళీ చేశారని ఘయ్ తెలిపారు. 'మే 7వ తేదీన చేపట్టిన ఆపరేషన్‌లో ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలే మాలక్ష్యం. అంతే తప్ప పాకిస్థానీ పౌరులు, ఆ దేశ సైనిక స్థావరాలు కాదు. మా లక్ష్యాలను మేం కచ్చితంగా సాధించాం. కానీ.. ఆ తర్వాత పాకిస్థానీ డ్రోన్లు మన మిలటరీ ఏరియాలను, పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగాయి. వాటిని విజయవంతంగా కూల్చేశాం" అని వివరించారు. నియంత్రణ రేఖ వెంబడి గ్రామాలను, పౌరులను, గురుద్వారాల వంటి మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ చేసిన దాడుల్లో కొందరు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. అదే సమయంలో.. భారత సైన్యం జరిపిన ఎదురుకాల్పుల్లో పాక్ ఆర్మీకి చెందిన 35-40 మంది సిబ్బంది చనిపోయినట్టు తెలిపారు. డ్రోన్లు, క్షిపణులతో మన సైనిక స్థావరాలపై దాడికి పాక్ చేసిన యత్నాల్ని.. దీటుగా తిప్పికొట్టామని స్పష్టం చేశారు. ఇకపై పాక్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే అందుకు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ యుద్ధంలో భారతదేశం అపారమైన సంయమనాన్ని పాటించిందని.. మన చర్యలు స్పష్టమైన లక్ష్యాలతో, తూచినట్టు, ఉద్రిక్తతలను పెంచని విధంగా ఉన్నాయని ఆయన తేల్చిచెప్పారు. భారత సార్వభౌమాధికారానికి, ప్రాదేశిక సమగ్రతకు, పౌరుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లినా తిప్పికొడతామని హెచ్చరించారు. యుద్ధాన్ని ఆపే మార్గం చూడాలంటూ పాకిస్థానీ డీజీఎంవో నుంచి తనకు శనివారం మధ్యాహ్నం ఫోన్ వచ్చిందని రాఘవ్ ఘయ్ తెలిపారు. అయితే.. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా పాకిస్థాన్ ఆర్మీ ఎల్‌వోసీ వెంబడి కాల్పులు తిరిగి మొదలుపెట్టిందని, డ్రోన్లనూ ప్రయోగిస్తోందని ధ్వజమెత్తారు. పాక్ ఉల్లంఘనలకు దీటుగా జవాబు చెప్పేందుకు సైన్యాధ్యక్షుడు తమకు అన్ని అధికారాలూ ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. సీజ్‌ఫైర్ ఉల్లంఘనపై తాను పాక్ డీజీఎంవోకు హాట్‌లైన్ సందేశాన్ని పంపానని.. మరోసారి ఇలాంటివి జరిగితే తీవ్ర ప్రతిదాడులకు దిగుతామని హెచ్చరించానని తెలిపారు. అలాగే.. ఈ యుద్ధంలో అమరులైన ఐదుగురు జవాన్లకు నివాళులు అర్పిస్తున్నానని డీజీఎంవో ఘయ్ పేర్కొన్నారు.



**ఇప్పుడే చెప్పలేను..**

పాకిస్థాన్‌కు చెందిన ఎన్ని విమానాలను భారత్ కూల్చేసిందన్న ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు.. డీజీఏవో ఏకే భార్తీ నిరాకరించారు. కచ్చితంగా కొన్ని విమానాలను నేలకూల్చామన్న ఆయన.. సంఖ్యను వెల్లడించడానికి తిరస్కరించారు. పాక్ విమానాలు ఎన్నింటిని కూల్చిందీ తనవద్ద నంబర్లు ఉన్నా.. వాటిని రుజువుచేసే సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నామని, కాబట్టి ఈ దశలో తాను సంఖ్యలను చెప్పలేనని వివరించారు. భారత యుద్ధవిమానాలను పాక్ కూల్చేసిందంటూ పాశ్చాత్య మీడియాలో వస్తున్న వార్తల గురించి ప్రస్తావించగా.. "మనం యుద్ధంలో ఉన్నాం. యుద్ధంలో నష్టాలు కూడా భాగమే" అని జవాబిచ్చారు. ఎన్ని విమానాలు కూలాయి? ఏ ప్లాట్‌ఫామ్‌లను కోల్పోయాం వంటి వివరాలపై ఈ సమయంలో తానేమీ మాట్లాడదల్చుకోవట్లేదని.. ఎందుకంటే ఈ దశలో ఏదైనా మాట్లాడితే అది శత్రువులకు అనుకూలంగా మారుతుందని అన్నారు. "అయినా మీరు అడగాల్సిన ప్రశ్న.. 'ఉగ్రవాద శిబిరాలను నాశనం చేయాలన్న లక్ష్యాన్ని మనం సాధించామా?' అని. దానికి సమాధానం.. అవును" అని ఆయన పేర్కొన్నారు. "ఏదేమైనా నేను చెప్పేది ఒక్కటే. మనం ఎంచుకున్న లక్ష్యాలను సాధించాం. మన పైలట్లందరూ సురక్షితంగా వెనక్కి తిరిగొచ్చారు" అని ఆయన వివరణ ఇచ్చారు.

**కరాచీ సహా..**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రస్థావరాలపై క్షిపణి దాడులు జరుగుతున్న సమయంలో మన నౌకాదళం అరేబియా సముద్రంలో యుద్ధనౌకలను మోహరించడంతో.. పాకిస్థాన్ నేవీ హార్బర్‌కే పరిమితమైందని వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేసిన దాడుల్లో నౌకాదళం పాత్ర గురించి నేవీ వెల్లడించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఆదివారంనాటి మీడియా సమావేశంలో మాట్లాడిన వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్.. ఆ వివరాలను వెల్లడించారు. పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన 96 గంటల్లోనే.. అరేబియా సముద్రంలో నేవీ క్యారియర్ బ్యాటిల్ గ్రూప్స్, జలాంతర్గాములు తదితరాలను పూర్తి యుద్ధ సన్నద్ధతతో మోహరించామని ఆయన వివరించారు. కరాచీ సహా.. సముద్రంలో, భూమ్మీద ఎంపిక చేసిన లక్ష్యాలపై దాడి చేయడానికి పూర్తి సన్నద్ధతతో, సామర్థ్యంతో నౌకాదళాన్ని సముద్రంలో మోహరించినట్టు తెలిపారు. దీంతో పాకిస్థానీ నౌకాదళ, వాయుసేన విభాగాలు ఆత్మరక్షణలో పడ్డాయని, హార్బర్లలోను, తీరానికి చేరువలో ఉండిపోయాయని.. తాము వాటిని నిరంతరం పరిశీలించామని చెప్పారు.

# పుల్వామా ఉగ్రదాడి మా పనే

**2019 నాటి దాడి పాకిస్థాన్ 'వ్యూహాత్మక ప్రతిభ'**

**మా దేశ రక్షణలో రాజీలేదు: పాక్ ఎయిర్ వైస్ మార్షల్ అహ్మద్**

**మరోసారి బయటపడ్డ దాయాది కపట నాటకాలు**

**ఇస్లామాబాద్/న్యూఢిల్లీ, మే 11:** పాకిస్థాన్ వక్రబుద్ధి, కపట నాటకం మరోసారి బహిర్గతమైంది. ఉగ్రవాదులతో తమకు లింకులులేవని, భారత్‌లో జరిగిన ఉగ్రదాడులతో తమకు సంబంధంలేదని ఎప్పుడూ అలవాటుగా చెప్పే మాటలు బూటకమని వెల్లడైంది. 2019లో జరిగిన పుల్వామా దాడిలో పాక్ హస్తం ఉందని తాజాగా ఆ దేశ వాయుసేన అధికారి ఒక విధంగా అంగీకరించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనంతరం శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పాకిస్థాన్ ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబు అహ్మద్ మాట్లాడుతూ పుల్వామా దాడిని పాక్ 'వ్యూహాత్మక ప్రతిభ'గా పేర్కొన్నారు. పలు విదేశీ మీడియా ప్రతినిధుల సమక్షంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వీడియో సోషల్‌మీడియాలో వైరలైంది. 'పాకిస్థాన్ భూభాగం, గగనతలం, నీరు లేదా దేశ ప్రజలకు ముప్పు కలిగితే.. ఆ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదు. మేం మా దేశానికి కట్టుబడి ఉంటాం. పాక్ ప్రజలు తమ సాయుధ దళాలపై కలిగివున్న గర్వాన్ని, విశ్వాసాన్ని మేం ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటాం. ఈ విషయన్ని పుల్వామాలో తమ వ్యూహాత్మక ప్రతిభ ద్వారా తెలియజేయడానికి ప్రయత్నించాం. ఇప్పుడు మా కార్యదక్షత, వ్యూహాత్మక చతురత, నైపుణ్యాలను ప్రదర్శించాం. వారు గమనించారని అనుకుంటున్నాను' అని ఆహ్మద్ వ్యాఖ్యానించారు. ఈ మీడి యా సమావేశంలో డీజీఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి, నేవీ అధికార ప్రతినిధి ఉన్నారు. కాగా, పుల్వామా దాడిని పాక్ అంగీకరించడం అరుదే అయినా ఇదే తొలిసారి కాదు. గతంలో 2020లో అప్పటి పాక్ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి ఫవద్ చౌదురి పుల్వామా ఉగ్రదాడికి పాకిస్థాన్ కారణమని బహిరంగంగా అంగీకరించారు. ఈ రెచ్చగొట్టే చర్య భారత్‌తో యుద్ధం అంచు వరకు తీసుకెళ్లిందన్నారు. పాక్ నేషనల్ అసెంబ్లీలో ఫవద్ చౌదురి మాట్లాడుతూ 'మేం భారత్‌ను వారి దేశంలోనే కొట్టాం. పుల్వామాలో మనం సాధించిన విజయం.. ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలో దేశానికి సాధించిన విజయం' అని పేర్కొన్నారు. కాగా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రసంస్థ జేషే మహ్మద్ 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఈ దారుణ ఘటనలో 40మంది పారామిలటరీ జవాన్లు మరణించారు. ఈ ఘటనలో తమ పాత్ర ఏమీ లేదని పాకిస్థాన్ అప్పటి నుంచి ఇప్పటి వరకు చెప్పుకుంటూ వస్తోంది. పహల్గాం దాడి విషయంలోనూ పాక్ వైఖరి ఇదేవిధంగా ఉంది. అయితే పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందన్న ఆరోపణలను ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల ధ్రువీకరించడం గమనార్హం.



# ఇందిరా గాంధీని గుర్తు చేసుకున్న సీఎం రేవంత్

**భారత ఉక్కు మహిళ అంటూ 'ఎక్స్'లో పాత ఫొటోతో పోస్టు**

**హైదరాబాద్, మే 11 :** భారత ఉక్కు మహిళ.. అంటూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ యుద్ధ సమయంలో దేశ సైనికాధికారులతో ఉన్న పాత ఫొటోను సీఎం రేవంత్ రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుతం భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం, కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో గతంలో ఇవే పరిస్థితుల్లో ఇందిరా గాంధీ వ్యవహరించిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు.

కాగా, పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా కొద్దిరోజుల కింద నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలోనూ ఇందిరాగాంధీని దుర్గామాతగా అప్పటి ప్రతిపక్ష నేత వాజ్‌పేయి అభివర్ణించారన్న విషయాన్ని సీఎం ప్రస్తావించిన సంగతి తెలిసిందే..

# స్వదేశీ సాంకేతికత అభివృద్ధే లక్ష్యం

**రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం కృషి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**




**హైదరాబాద్, మే 11 :** స్వదేశీ సాంకేతికత ఆధారంగా ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు కొత్త ఆవిష్కరణల దిశగా కృషి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశానికి అసాధారణమైన సాంకేతికతను అందించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోఖ్రాన్ అణు పరీక్షల వెనక ఉన్న శ్రమను కొనియాడారు. ఇది మన దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని, సంకల్పాన్ని చాటిన అసాధారణ ఘట్టమని కిషన్‌రెడ్డి ప్రశంసించారు.తెలంగాణ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి రహదారుల విస్తరణ చేపట్టిందని తెలిపారు. 2014 నుంచి రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం రూ. 31,000 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఈ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 2,722 కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం, మరో 2,526 కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ఉన్నతీకరణ చేశామని వెల్లడించారు. భవిష్యత్‌లో భారతమాల పరియోజన మొదటి దశలో రూ.38,297 కోట్ల భారీ బడ్జెట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా మరో 1,719 కి.మీ. జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.


ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 మే
2025





# నరసింహుడి జయంతి ఉత్సవాలు పరిసమాప్తి





**పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకంతో ఉత్సవాలు ముగింపు**

**పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు**

**నేటి నుండి ఆర్జిత సేవలు పునరుద్ధరణ**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నరసింహుడి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. యాదగిరిగుట్ట, పాతగుట్ట ఆలయాల్లో ఈ నెల 9న ప్రారంభమైన ఉత్సవాలను ఆదివారం చేపట్టిన పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం, నృసింహ జయంతి, నారసింహ ఆవిర్భావ ఘట్టంతో అర్చకులు వైభవంగా పరిసమాప్తి పలికారు. ఉదయం నిత్య పూజల అనంతరం.. ఉత్సవాలలో భాగంగా అర్చకులు మహాపూర్ణాహుతిని నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో సహస్ర కలశాభిషేకాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. వెయ్యి కలశాలను వరుస క్రమంలో పేర్చి, మంత్రజలంతో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల వేదపారాయణాలు, రుత్వికుల మంత్రోచ్చారణల మధ్య సహస్ర కలశాభిషేకం ఘట్టాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఇక సాయంత్రం ఆలయంలో జరిపిన నృసింహ జయంతి, స్వామివారి ఆవిర్భావ మహోతంతుతో అర్చకులు ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు. అనంతరం స్వామివారికి నివేదన, తీర్థప్రసాద గోష్టితో జయంతి వేడుకలకు ముగింపు పలికారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో ఆలయ అర్చకులు జయంతి ఉత్సవాలను వైభవోపేతంగా జరిపారు.

**జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్**

నరసింహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో నిర్వహించిన సహస్ర కలశాభిషేకంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. దాదాపుగా రెండు గంటల పాటు నిర్వహించిన సహస్ర కలశాభిషేకంలో వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించగా.. ఆలయ ఈవో వెంకటరావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

యాదగిరిగుట్టపై నారసింహుడి జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంకు చెందిన శ్రీరామ భక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీయాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి మహిళా భజన మండలి బృందం సభ్యులు నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను అమితంగా అలరించాయి. సాయంత్రం శ్రీవేంకట అన్నమాచార్య సేవా ట్రస్టు, శ్రీసత్యసాయి నృత్య అకాడమీ సభ్యులు చేసిన కూచిపూడి నృత్యం, హైదరాబాద్ కు చెందిన అనుశ్రీ మ్యూజికల్ ఈవెంట్స్ బృందం చేసిన భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకున్నాయి.

## జయంతి వేళ...భక్తుల ఆనంద హేళ!!

శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి మహోత్సవం కుతోడుగా సెలవులు ఆదివారం కలిసి రావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున భక్తులు యాదగిరిగుట్టకు తరలివచ్చారు. శ్రీ స్వామి వారిని రికార్డు స్థాయిలో సుమారు 85, 000. మంది శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు ప్రకటించారు.

**నేటి నుండి ఆర్జిత సేవలు షురూ**

లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుండి తాత్కాలికంగా రద్దు చేయబడిన ఆర్జిత సేవలు సోమవారం నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఆదివారంతో జయంతి ఉత్సవాలు పరిసమాప్తం కావడంతో.. సోమవారం నుండి భక్తుల చేత ప్రతిరోజూ నిర్వహింపబడే నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలు, ఆర్జిత సేవలు తిరిగి షురూ కానున్నాయి.

**'పుంగనూరు గోమాత'తో భక్తుల గిరిప్రదక్షిణ**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా.. ఆదివారం యాదగిరిగుట్ట చుట్టూ పుంగనూరు గోమాతతో కలిసి భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. గోరక్షణ, భూరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ధర్మం కోసం గతంలో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు.. 182 రోజుల్లో 14 రాష్ట్రాల్లో 5158 కిలోమీటర్లు పాద యాత్ర చేసిన పుంగనూరు గోమాతతో దాదాపుగా వెయ్యి మంది గోభక్తులు, భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. ఉదయం 5 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ తో కలిసి నారసింహుడి పాదాలకు ఆలయ ఈవో వెంకటరావు ప్రత్యేక పూజలు చేసి గోమాత, భక్తులతో కలిసి గిరిప్రదక్షిణ చేశారు. కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల గిరిప్రదక్షిణ చేసి కాలినడకన కొండపైకి వెళ్ళి చేసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని తరించారు. గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ ఆఫీసర్లు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





















# యాదగిరిగుట్టకు భక్తజన సందోహం

## ధర్మదర్శనానికి 4, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం

## సండే స్వామివారికి రూ.63.64 లక్షల ఆదాయం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి ఆదివారం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సమ్మర్ సెలవులు, స్వామివారి జయంతి ఉత్సవాలకు తోడు ఆదివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో ఎక్కడ చూసినా భక్తజన సందోహమే కనిపించింది. రద్దీ కారణంగా భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. ధర్మ దర్శనానికి నాలుగు గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కేవలం వీఐపీ టికెట్ల ద్వారా 8700 మంది భక్తులు, బ్రేక్ దర్శనాల ద్వారా 1991 భక్తులు నారసింహుడిని దర్శించుకోగా.. 3400 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రద్దీ కారణంగా కొండ కింద కళ్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, సత్యనారాయణస్వామి వ్రత మండపాలు, పార్కింగ్ ప్రదేశం.. కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. కొండపైన పార్కింగ్ ప్లేస్ నిండిపోవడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యేంతవరకు కొండపైకి భక్తుల వాహనాలను నిలిపివేశారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. ఇక అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు జరిపించిన పూజలతో స్వామివారి ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.63,64,480 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.22,43,690, వీఐపీ దర్శనాలతో రూ.13.05 లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6,08,500, బ్రేక్ దర్శనాల ద్వారా రూ.5,97,300, వ్రతాల నిర్వహణతో రూ.2,02,400, యాదరుషి నిలయం ద్వారా రూ.2,75,082, కళ్యాణకట్ట ద్వారా రూ.1.70 లక్షలు ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.







# ఛాయ్ తాగుతూ చర్చ.. వాకింగ్ చేస్తూ పలకరింపు

## యాదగిరిగుట్టలో కలియతిరిగి ప్రజలను పలకరించిన ఎమ్మెల్యే బీర్ల

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం స్థానిక ప్రజలతో మమేకం అయ్యారు. యాదగిరిగుట్ట నుండి వడాయిగూడెం చౌరస్తా వరకు ప్రధాన రహదారిలో స్థానిక నాయకులతో కలిసి వాకింగ్ చేశాయి. పలు టీ స్టాళ్ల వద్ద ఛాయ్ తాగుతూ ప్రజల సమస్యలపై ఆరా తీశారు. వాకింగ్ చేసే సమయంలో కలిసినవారిని పలకరిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా సాధారణ పౌరుడి వలె పట్టణంలో తిరిగి ఎదురుపడిన అందరినీ పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.






# అమ్మకాలు కంటిన్యూ

## సెన్సెక్స్ 880 పాయింట్లు డౌన్.. 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు ఉఫ్

ముంబై: భారత్-పాకిస్థాన్ మధ్య పోరు తీవ్రతరమవడంతో అప్రమత్తమైన ఈక్విటీ మదుపరులు వరుసగా రెండో రోజూ అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో మన స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 880.34 పాయింట్లు కోల్పోయి 79,454.47 స్థాయికి జారుకుంది. నిఫ్టీ 265.80 పాయింట్లు క్షీణించి 24,008 వద్ద స్థిరపడింది. గడిచిన రెండు సెషన్లలో సెన్సెక్స్ 1,292.31 పాయింట్లు (1.60 శాతం) నష్టపోగా.. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎసఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.09 లక్షల కోట్లు తగ్గి రూ.416.40 లక్షల కోట్లకు (4.86 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 నష్టపోయాయి. రక్షణ రంగ షేర్లు జూమ్: పాక్‌తో పోరు నేపథ్యంలో దేశీయ రక్షణ రంగానికి చెందిన ముఖ్యంగా డ్రోన్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. బీఎస్ఈలో పారస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ స్టాక్ 7.18 శాతం పుంజుకోగా.. భారత్ డైనమిక్స్ 5.34 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.92 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 1.84 శాతం, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ 1.38 శాతం పెరిగాయి. డ్రోన్ తయారీదారుల్లో ఐడియాఫోర్జ్ టెక్నాలజీ షేరు ఏకంగా 20 శాతం ఎగబాకింది. డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్ 4.99 శాతం లాభపడింది.

# తెలంగాణలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఖైదీలు

## శిక్ష పూర్తయ్యలోపు తీర్చి దిద్దేందుకు కృషి

## ఖైదీల వార్షిక క్రీడలు 2025 ము గింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్ బా బు



**హైదరాబాద్:** శిక్ష పూర్తయ్యేలోపు ఖైదీల్లో మార్పు తీసుకొచ్చి వారిని బాధ్యతాయుత మైన పౌరులుగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దు ద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆది వారం జైళ్ల శాఖ ఆధ్వర్యంలో చర్ల పల్లి సెంట్రల్ జైల్లో నిర్వహించిన "ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు - 2025 ముగింపు వేడు కలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగు ణంగా తెలంగాణ జైళ్ల శాఖ అమ లు చేస్తున్న సంస్కరణలు ఇతర రా ష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచా యని ఈ సందర్భంగా మంత్రి వివ రించారు. తెలిసో తెలియకో చేసిన తప్పులకు శిక్షను అనుభవిస్తున్న ఖైదీల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొం దించేందుకు అనేక చేతి వృత్తులు, ఇతర పనుల్లో నైపుణ్య శిక్షణ అం దిస్తున్నామన్నారు. ఖైదీలు మాన సిక ఒత్తిడికి గురి కాకుండా నిపుణు లతో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇప్పి స్తున్నామన్నారు. ఖైదీలు తయారు చేసే ఉత్పత్తు లకు మంచి డిమాండ్ ఉందని, ఆ దిశగా వారిని మరింత ప్రోత్సహిస్తా మన్నారు. జైలుకు కావాలని ఎవ రూ రారని, బయటకు వెళ్లిన తర్వా త మరోసారి అలాంటి తప్పు చేయ కుండా గౌరవంగా జీవించాలని ఖైదీ లకు సూచించారు. సత్ప్రవర్తనతో మెలిగే ఖైదీలకు ప్రభుత్వం తరఫు న వీలైనంత వరకు అండగా ఉ ంటా మన్నారు. శిక్ష అనుభవించే సమ యంలో ఆందోళనకు గురి కావొద్ద ని, అలాగే కాలాన్ని వృథా చేయ కుండా ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ పొందాలని సూచించారు. ఒకవేళ ఉన్నత విద్యను అభ్య సించాలను కుంటే నిబంధనల ప్రకారం జైళ్ల శా ఖ తరఫున సహకరిస్త మన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేం దర్ రెడ్డి, జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా, పలువురు ఉన్నతాధికారు లు పాల్గొన్నారు.

# బీజేపీ బీసీలకు వ్యతిరేకం: పొన్నం

**హైదరాబాద్, మే 11 :** బీసీలకు బీజేపీ ఎప్పుడూ అన్యాయమే చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆ పార్టీలో అధికార పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించని బీజేపీ.. గతంలో కులగణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ సమర్పించిందన్నారు.

బీసీల విషయంలో కాంగ్రెసపై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, సంస్థలు, మేధావులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను ప్రశంసిస్తుండగా బీజేపీ నాయకులు మాత్రం కాళ్లల్లో కట్టె పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.



# పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్..

## తగ్గిన బంగారం ధరలు

భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం జరుగుతోంది. పోటాపోటీగా రెండు దేశాలు బాంబుల వర్షం కురిపించుకుంటున్నాయి. యుద్ధ ప్రభావం ఇప్పటికైతే సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయింది. లోపల ఉన్న ప్రజలు కొంచెం టెన్షన్‌లో ఉన్నా.. వివాహాది ఇతర కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. పెళ్లిళ్లలకు ఇతర ఫంక్షన్‌లకు బంగారం కొనాలనుకునే వారికి ఇది గుడ్‌న్యూస్ అని చెప్పొచ్చు. గత కొద్ది రోజుల నుంచి పెరుగుతూ పోయిన బంగారం ఇప్పుడు తగ్గింది. పసిడి ప్రియులకు ఊరటనిస్తోంది.

**ఈ రోజు బంగారం ధరలు ఇలా..**

నిన్న 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 98350 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90150 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 73760 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, ఈ రోజు 18,22,24 క్యారెట్ల బంగారంపై 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఈ రోజు 98340 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90140 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 73750 దగ్గర ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు ఇలా..**

బంగారంతో సంబంధం లేకుండా వెండి ధరలు ప్రతీ రోజూ తగ్గుతూనే ఉన్నాయి. రోజుకు ఎంత లేదన్నా కేజీపై 10 రూపాయలు తగ్గుతోంది. నిన్న 100 గ్రాముల వెండి ధర 11100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,11,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాములపై 10 రూపాయలు, కేజీపై 100 రూపాయలు తగ్గింది. ఈ రోజు 100 గ్రాముల వెండి ధర 11,090 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ బంగారం ధర 1,10,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.


ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 మే 2025





# మాపై దాడి జరిగితే.. తీవ్రంగా స్పందిస్తాం

**పీవోకేను తిరిగి ఇవ్వాల్సిందే..**
**ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాలి**
**ఇవి జరిగితేనే పాకిస్థాన్‌తో చర్చలు**
**మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అక్కర్లేదు**
**అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్‌కు మోదీ స్పష్టం**
**చేసినట్లు సీఎన్ఎన్, ఇండియాటుడే కథనాలు**
**ఇంటెలిజెన్స్ హెచ్చరికలతోనే మోదీకి వాన్స్ ఫోన్**
**వైట్‌హౌస్ వర్గాలను ఉటంకించిన సీఎన్ఎన్**
**ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించిన మోదీ**
**పాక్ నుంచి బుల్లెట్లొస్తే శతఘ్నులతో బదులు!**
**కాల్పుల విరమణ ఉల్లంఘన జరిగితే**
**ఆర్మీ చీఫ్‌కు సర్వాధికారాలు ఇస్తూ ఆదేశాలు**



**న్యూఢిల్లీ, మే 11:** పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను భారత్‌కు తిరిగి ఇవ్వాల్సిందేనని.. చర్చలకు ఇదే ప్రధానమని ప్రధాని మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తేల్చిచెప్పినట్లు తెలిసింది. పాకిస్థాన్ తమకు ఉగ్రవాదులను అప్పగించాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ మేరకు శనివారం ఉదయం జేడీ వాన్స్, మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వివరాలతో సీఎన్ఎన్, ఇండియాటుడే టీవీ కథనాలను ప్రచురించాయి. "పీవోకేను తిరిగి తీసుకోవడం మా ప్రాథమ్యం. కశ్మీర్‌పై మాకు స్పష్టత ఉంది. ఈ విషయంలో మాకు ఎలాంటి మధ్యవర్తిత్వం అవసరం లేదు" అని వ్యాఖ్యానించినట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే.. మోదీకి జేడీ వాన్స్ ఫోన్ చేయడానికి బలమైన కారణాలున్నట్లు సీఎన్ఎన్ మరో కథనంలో తెలిపింది. "శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారత్-పాక్‌ల మధ్య పోరు తీవ్రమైంది" అంటూ అత్యంత కీలకమైన హెచ్చరికలను ఇంటెలిజెన్స్ వర్గాలు వైట్‌హౌసకు అందజేసినట్లు పేర్కొంది. అయితే.. ఇంటెలిజెన్స్ హెచ్చరికల్లోని ముఖ్యాంశాలను మాత్రం ఆ వర్గాలు వెల్లడించలేదని వివరించింది. ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు వాన్స్, జాతీయ భద్రత సలహాదారు, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్ భారత్-పాక్ ఉద్రిక్తతలను తక్షణం నిలువరించాల్సిన అవసరం ఉందని భావించినట్లు వెల్లడించింది. ఆ మేరకు వైట్‌హౌస్ తీసుకున్న నిర్ణయంతో వాన్స్ వెంటనే(శనివారం ఉదయం) ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసినట్లు స్పష్టం చేసింది. వాన్స్ పర్యటన సందర్భంలోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే..! వాన్స్‌తో ఫోన్ సంభాషణలో భాగంగా ప్రధాని మోదీ.. పీవోకే, ఉగ్రవాదుల అప్పగింతపై ప్రపంచం.. ప్రత్యేకించి పాకిస్థాన్ అంగీకరించాలని అన్నట్లు సీఎన్ఎన్, ఇండియాటుడే కథనాలు తెలిపాయి. ఒకవేళ పాక్ మళ్లీ కాల్పులు జరిపితే.. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని తేల్చిచెప్పినట్లు వివరించాయి.

భారత్-పాక్ మధ్య చర్చలు ప్రధాని స్థాయిలోనో.. జాతీయ భద్రత సలహాదారుల స్థాయిలోనో జరగవని, మిలటరీ ఆపరేషన్ల డైరెక్టర్ జనరల్స్(డీజీఎంవో) స్థాయిలో చోటుచేసుకుంటాయని వివరించినట్లు తెలిపాయి. భారత్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ప్రకటన రాగానే.. ఉన్నఫళంగా తీసుకున్న ఈ నిర్ణయంపై మోదీ సర్కారుపై వ్యతిరేకత వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ కథనాలు ప్రచురితమవ్వడం గమనార్హం..!

**విదేశాంగ శాఖ వర్గాలదీ అదే మాట**

భారత విదేశాంగ శాఖ(ఎంఈవో) వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ, అంతర్జాతీయ వార్తాసంస్థలు కూడా ఆదివారం కథనాలను ప్రచురించాయి. పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగితే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆ వర్గాలు స్పష్టం చేసినట్లు తెలిపాయి. పహల్గాం దాడులకు ప్రతిగా ఈ నెల 7న పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపాక.. ఆ దేశ డీజీఎంవోకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నాయి. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పామని వెల్లడించాయి. దీనిపై పాకిస్థాన్ నుంచి ఎలాంటి స్పందన రాకపోగా.. సరిహద్దుల్లోని పౌరులను టార్గెట్‌గా చేసుకుని, పాక్ కాల్పులు జరిపినట్లు గుర్తుచేశాయి. ఆ తర్వాత భారత్ స్పందన తీవ్రంగా మారడంతో.. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పాక్ డీజీఎంవో నుంచి ఫోన్ వచ్చిందని, ఆ సమయంలో త్రివిధ దళాల భేటీ ఉండడంతో తిరిగి 3.45 సమయంలో ఇరుదేశాల డీజీఎంవోలు మాట్లాడుకున్నట్లు పేర్కొన్నాయి. ఈ సంభాషణలోనే కాల్పుల విరమణ అంశంపై చర్చ జరిగిందని తెలిపాయి. విదేశాంగ శాఖ వర్గాలు కూడా చర్చల్లో కశ్మీర్‌ను అప్పగించడం మినహా.. మరో అంశం అండబోదని, ఈ విషయంలో మధ్యవర్తిత్వాన్ని తాము కోరుకోవడం లేదని స్పష్టం చేసినట్లు పేర్కొన్నాయి.

**ఆర్మీ చీఫ్‌కు పూర్తిస్వేచ్ఛ**

కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ.. శనివారం రాత్రి పాక్ కాల్పులు, మిసైల్ దాడులు జరిపిన నేపథ్యంలో.. ఆదివారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ భద్రత సలహాదారు డోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. అటువైపు నుంచి తూటా(గోలీ) వస్తే.. మీరు(సైన్యం) శతఘ్నుల(గోలా)ను ప్రయోగించాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ నుంచి మరోమారు కాల్పులు జరిగితే.. తిప్పికొట్టే పూర్తి స్వేచ్ఛను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీకి ఇచ్చినట్లు పేర్కొన్నాయి. ఆ వెంటనే వెస్టర్న్ కమాండ్ పరిధిలోని అందరు కమాండర్లకు ఆ అధికారాలను బదిలీ చేస్తున్నట్లు ప్రకటించాయని వివరించాయి.

**వెనువెంటనే మారిన అమెరికా తీరు!**

భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తీరు గంటల వ్యవధిలోనే మారిపోవడం గమనార్హం..! గురువారం సాయంత్రం అమెరికా విదేశాంగ మంత్రి రూబియో ఇరుదేశాల ప్రధానులతో ఫోన్‌లో మాట్లాడారు. తొలుత మోదీకి ఫోన్ చేశారు. ఆ తర్వాత పాక్ ప్రధాని షహబాజ్ షరీఫకు ఫోన్ చేసి.. 'ఆల్ ఔట్‌కు భారత్ సిద్ధమవుతోంది. మీలో మీరు చర్చించుకుని, సమస్యలను పరిష్కరించుకోండి" అని సలహా ఇచ్చారు. ఆ వెంటనే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఎక్స్'లో ఓ ప్రకటన చేశారు. భారత్-పాక్ ఉద్రిక్తతల్లో తాము తలదూర్చబోమని స్పష్టంచేశారు. శనివారం ఉదయం అనూహ్యంగా జేడీ వాన్స్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి, సంయమనం పాటించాలని, బలగాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. సాయంత్రానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో "కాల్పుల విరమణకు భారత్-పాక్ అంగీకరించాయి" అని పేర్కొన్నారు. ఆ తర్వాతే ఇరు దేశాల నుంచి కాల్పుల విరమణపై ప్రకటనలు వచ్చాయి.




# ఎప్‌సెట్‌లో అబ్బాయిల హవా

**ఇంజనీరింగ్‌లో టాప్-10 ర్యాంకర్లంతా వారే**
**మొదటి మూడు ర్యాంకులూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే**
**తెలంగాణ ఎప్‌సెట్-2025 ఫలితాల విడుదల**

**హైదరాబాద్, మే 11 :** ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఎప్‌సెట్-2025లో అబ్బాయిలు సత్తా చాటారు. ఇంజనీరింగ్‌లో టాప్-10 ర్యాంకుల్లో అంతా బాలురే నిలిచారు. అగ్రికల్చర్, ఫార్మసీలోనూ టాప్-10లో తొమ్మిది ర్యాంకులను వారు కైవసం చేసుకున్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసం లో ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేశారు. ఈసారి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 2,07,190 మంది విద్యార్థులు హాజరు కాగా.. 1,51,779 మంది (73.26శ) ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీలో 81,198 మంది హాజరు కాగా, 71,309 మంది విద్యార్థులు (87.82శ) అర్హత సాధించారు. ఇంజనీరింగ్ విభాగం లో టాప్-10 ర్యాంకుల్లో మొదటి మూడు ర్యాంకులూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులకే దక్కాయి. వీరిలో పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుణానుపురం గ్రామానికి చెందిన పల్లా భరత్‌చంద్ర 150.05 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. నంద్యాల జిల్లా కోనాపురం గ్రామానికి చెందిన ఉడగండ్ల రామచరణ్‌రెడ్డి 148.28 మార్కులతో రెండో ర్యాంకు సాధించాడు. ఇతడు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండ లం మాదాపూర్‌లో ఇంటర్మీడియట్ చదివాడు. కాగా, విజయనగరం జిల్లాకు చెందిన పమ్మిన హేమసాయి సూర్య కార్తీక్ 147.08 మార్కులతో మూడోస్థానం పొందాడు. కాగా, ఫార్మసీ, అగ్రికల్చర్‌లో హైదరాబాద్‌కు చెందిన సాకేత్‌రెడ్డి 141.68 మార్కులతో టాపర్‌గా నిలవగా, కరీంనగర్ విద్యార్థి సబ్బాని లలిత్ వరేణ్య 140.47 మార్కులతో రెండో ర్యాంకు, వరంగల్‌కు చెందిన చాడ అక్షిత్ 140 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు.

**ఉత్తీర్ణత శాతంలో అమ్మాయిలదే పైచేయి**

ఎప్‌సెట్‌లో రెండు విభాగాల్లోనూ అమ్మాయిల ఉత్తీర్ణత శాతం ఎక్కువగా నమోదైంది. ఇంజనీరింగ్ విభాగంలో బాలురు 72.79%, బాలికలు 73.88% మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక అగ్రికల్చర్, ఫార్మసీలో బాలురు 86.29%, బాలికలు 88.32శ ఉత్తీర్ణత సాధించారు. కాగా, మొత్తం ఫలితాల్లో గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం తగ్గింది. 2024లో ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణత 74.98 శాతం నమోదు కాగా, 2023లో 80.34%, 2022లో 80.42% ఉంది. అగ్రికల్చర్, ఫార్మసీలో 2024లో 89.67%, 2023లో 86.31%, 2022లో 88.34 శాతం నమోదైంది.

**సత్తా చాటిన గురుకుల విద్యార్థులు**

ఎప్‌సెట్ ఫలితాల్లో గురుకుల విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. సాంఘిక సంక్షేమ గురుకులాల నుంచి ఇంజనీరింగ్ విభాగంలో 953 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై అందరూ ఉత్తీర్ణత సాధించారని గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో 859 మంది విద్యార్థులు హాజరు కాగా, 857 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో నార్సింగ్ కాలేజీకి చెందిన బి.ప్రవళిక రాష్ట్రస్థాయిలో 1091 ర్యాంకు, ఫలక్‌నుమా కాలేజీకి చెందిన చైతన్య 1769 ర్యాంకు సాధించారని వెల్లడించారు. ఐదువేల లోపు 13 మంది, 10 వేలలోపు ర్యాంకులు 45 మంది, 20 వేలలోపు ర్యాంకులు 136 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో 1000లోపు ర్యాంకులు 19 మంది, 5వేలలోపు 67 మంది, 10 వేలలోపు 183 మంది, 20 వేలలోపు ర్యాంకులు 387 మంది సాధించినట్లు వివరించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు, అధ్యాపకులకు గురుకుల కార్యదర్శి అభినందనలు తెలిపారు. ఇక గిరిజన గురుకుల విద్యాసంస్థల నుంచి 750 మంది ఎప్‌సెట్‌కు హాజరుకాగా.. 24మంది విద్యార్థులకు 5వేల లోపు, 34మంది 10 వేల లోపు ర్యాంకులు సాధించారని ఎస్టీ గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో విద్యావతి యషశ్విని 649 (వరంగల్), కేతావత్ అఖిల 901 (దేవరకొండ) ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు.

# అమరుడా ఇక సెలవ్

**తరలివచ్చిన వేలాది జనం..**
**అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు**
**ఉప్పొంగిన భావోద్వేగం.. అమర్ రహే**
**అంటూ మిన్నంటిన నినాదాలు**
**పార్థివ దేహానికి పవన్ ఘన నివాళి**
**కుటుంబానికి అండగా ఉంటామని సీఎం**
**చంద్రబాబు భరోసా**



అనంతపురం మే 11 : దేశం రక్షణలో సరిహద్దులో పాకిస్థాన్ ఉగ్రమూకలతో పోరాడుతూ అమరుడైన వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు తీవ్ర భావోద్వేగాల మధ్య జరిగాయి. 'యుద్ధంలో నేలకొరిగిన ఓ అమరుడా.. ఇక నీకు సెలవు' అంటూ జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన వేలాది మంది అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో వీరజవాన్ మురళీ నాయక్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో ఆదివారం నిర్వహించారు. వీరజవాన్ పార్థివ దేహంపై కప్పిన జాతీయ జెండాను, అతడి దుస్తులను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సమయంలో మురళీనాయక్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. అంతకు ముందు తమ కుమారుడి పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తూనే... జై హింద్ అంటూ బరువెక్కిన హృదయాలతో ఆ తల్లిదండ్రులు సెల్యూట్ చేయడం అక్కడున్నవారిని మరిం త భావోద్వేగానికి గురి చేసింది. జాతీయ జెండాను గాల్లో ఊపు తూ, ఉద్వేగంతో 'భారత్ మాతాకీ జై... మురళీనాయక్ అమర్ రహే' అంటూ పెద్దపెట్టున జనం నినదించారు. గిరిజన సంప్రదాయ పద్ధతిలో మురళీనాయక్ అంత్యక్రియలను పూర్తి చేశారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓదార్పు

వీరజవాన్ మురళీ నాయక్ పార్థివ దేహంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళుల ర్పించారు. సెల్యూట్ చేశారు. మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదార్చారు. బోరున విలపిస్తున్న ఆ సైనికుడి తల్లి జ్యోతిబాయిని తన పక్కనే కూర్చోబెట్టుకుని కన్నీళ్లు తుడిచారు. ఇదే సందర్భంలో ఆ సైనికుడి తండ్రి శ్రీరామ నాయక్ చెప్పిన మాటలు పవన్ కల్యాణ్‌తోపాటు అక్కడున్న వారందరికీ కళ్లు చెమర్చేలా చేశాయి. 'రేయ్ మురళీ... పవన్ కల్యాణ్ సార్ వచ్చి కుర్చున్నారు. లేచి సార్‌కు సెల్యూట్ కొట్టు మురళీ... ఒక సారి పవన్ సార్‌ను చూడు మురళీ' అంటూ బోరుమన్నారు. పవన్ కల్యాణ్ ఆయనను సముదాయించి ఓదార్చారు.

**అండగా నిలిచిన ప్రభుత్వం.. పవన్**

ప్రభుత్వం తరఫున మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు, 5 ఎకరాల భూమి, 300 గజాల ఇంటి స్థలం, వీరజవాన్ తండ్రి శ్రీరాం నాయక్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా రూ.25 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సొంత భూమిలో మురళీ నాయక్ అంత్యక్రియలు నిర్వహించిన నేపథ్యంలో, అక్కడ స్థూపం ఏర్పాటుకు నిర్ణయించామని, జిల్లా కేంద్రంలో వీరజవాన్ మురళీ నాయక్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. కాగా, గ్రామస్థుల కోరిక మేరకు అమర జవాన్ మురళీ నాయక్ స్వగ్రామం కల్లి తండా పేరును ఇకపై మురళీ నాయక్ తండాగా మార్చనున్నట్లు మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది: డిప్యూటీ సీఎం**

వీరజవాన్ మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఆ కుటుంబానికి ఏ సాయం కావాలన్నా చేస్తాం. చిన్న వయసులోనే మురళీ నాయక్ అమరుడు కావడం చాలా బాధగా ఉంది. సైన్యంలో చేరాలన్న అతడి తపన.. మురళీ నాయక్ వీరోచిత పోరాటం చిరస్మరణీయం. ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని అందజేస్తాం. వ్యక్తితంగానూ ఉండ గా ఉంటాను.

**పవన్ వీరాభిమాని మురళీనాయక్**

యుద్ధంలో అమరుడైన కల్లితండాకు చెందిన జవాను అగ్నివీర్ మురళీనాయక్.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీరాభిమాని అని గ్రామస్థులు, అతడి స్నేహితులు తెలిపారు. రెండేళ్ల క్రితం మురళీనాయక్ సైన్యంలో చేరకముందు పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో మురళీనాయక్ చాలా హంగామానే చేశారు. ఎర్రచొక్కా వేసుకుని, తలకు రుమాలు చుట్టుకుని, జనసేన పార్టీ జెండా చేతపట్టుకుని స్నేహితులతో కలిసి పవన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవన్ కల్యాణ్‌కు క్రేన్ సాయంతో భారీ గజమాల కూడా వేశారు. ఆ ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఆదివారం కల్లి తండాలో మురళీ నాయక్ అంతిమయాత్రకు హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆ ఫొటోలు, వీడియోలను గ్రామస్థులు చూపించారు.

**మురళీ నాయక్ త్యాగం స్ఫూర్తిదాయకం: సీఎం చంద్రబాబు**

వీరజవాన్ మురళీనాయక్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అంతిమ నివాళులర్పించారు. ఈమేరకు ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. 'దేశరక్షణలో ప్రాణాలర్పించిన మురళీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మురళీ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందజేస్తాం. దీంతోపాటు 5 ఎకరాల సాగు భూమి, 300 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తాం. ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇస్తాం మురళీ నాయక్ మన మధ్య లేకపోయినా ఆయన చేసిన త్యాగం ఎప్పుడూ మనలో స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుంది' అని పేర్కొన్నారు.

**అంతిమయాత్ర వాహనంలో లోకేశ్**

మురళీ నాయక్ అంత్యక్రియలు చివరి వరకు మంత్రి నారా లోకేశ్ అక్కడున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకే కల్లితండాకు చేరుకున్న లోకేశ్, ముందుగా మురళీ నాయక్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. జై హింద్ అంటూ సెల్యూట్ చేశారు. అనంతరం అతని తల్లిదండ్రులను ఓదార్చారు. అంతిమయాత్ర ఉదయం 11 గంటలకు మొదలవ్వగా... జవాన్ పార్థివదేహాన్ని మిలటరీ వాహనంలో ఎక్కించే సమయంలో లోకేశ్ పాడె మోశారు. అదే వాహనంలో అంత్యక్రియల ప్రాంతం వరకు ప్రయాణించారు. జాతీయ జెండాను చేతబూని 'భారత్ మాతాకీ జై... వందేమాతరం.. మురళీ నాయక్ అమర్ రహే' అంటూ నినదించారు. మిలటరీ వాహనం నుంచి వ్యవసాయ క్షేత్రంలోకి మురళీ పార్థివ దేహాన్ని కిందకు దించగా, అక్కడి నుంచి గుంత వరకు పాడెను మోశారు. అనంతరం పార్థివ దేహాన్ని పేటిక నుంచి బయటకు తీయగా, మధ్యాహ్నం 12 గంటల సమయంలో సైనికులు గౌరవ వందనం సమర్పించారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించి, గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ప్రభుత్వ లాంఛనాలు పూర్తైన తర్వాత మురళి పార్థివదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వారు గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఖననం చేసే సమయంలో లోకేశ్ మట్టి పోసి, జై హింద్ అంటూ సెల్యూట్ కొట్టారు. కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న సహా పలువురు అధికారులు జవానుకు పుష్పాంజలి ఘటించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 మే 2025







## నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలులోకి రానుంది. అలాగే, జూన్ నెలాఖరు కల్లా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఓ ప్రకటన చేశారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని తొలుత 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభించామని, దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. రద్దీ, పని ఒత్తిడి అధికంగా ఉన్న కార్యాలయాల్లో అదనపు సబ్ రిజిస్ట్రార్‌లను నియమిస్తున్నామని చెప్పారు.

కుత్బుల్లాపూర్‌లో ఇద్దరు అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమించామని తెలిపారు. ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా స్లాట్ బుకింగ్ అమలు చేయనున్నామని వివరించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని పునర్వ్యవస్థీకరిస్తున్నామని, అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న కార్యాలయాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ క్రమంలోనే రంగారెడ్డి జిల్లా చంపాపేట, సరూర్‌నగర్ పరిధిని విలీనం చేశామని, షాద్‌నగర్, ఫరూక్‌నగర్ కలిపామని, సిద్దిపేట, సిద్దిపేట రూరల్ సబ్ రిజిస్ట్రార్‌లను విలీనం చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## ఈటల వ్యాఖ్యలు సరి కాదు



**హైదరాబాద్ సిటీ, మే 11 :** మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లి తహశీల్దార్ స్థానికంగా ఉన్న రెండు అపార్ట్‌మెంట్లకు ఇచ్చిన నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ నోటీసులను హైడ్రాకు ముడిపెడుతూ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సబబు కాదని ఆదివారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. తహశీల్దార్ నోటీసులు ఎందుకిచ్చారో తెలుసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ప్రతి నోటీసు, కూల్చివేతను హైడ్రాకు ఆపాదించి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం దురదృష్టకరమన్నారు. బడా భూకబ్జాదారుల విషయంలో కఠినంగా వ్యవహరించే హైడ్రా.. సామాన్యులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. సచివాలయంలో కలిసినప్పుడు వచ్చిన చర్చలో హైడ్రా కార్యకలాపాలను తాను ఈటలకు స్పష్టంగా వివరించానన్నారు. హైడ్రా పని తీరుపై ప్రజలు స్పష్టతతో ఉన్నారని, అనవసరమైన ఆరోపణలు చేసి ప్రజలను అయోమయానికి గురి చేయొద్దని సూచించారు. 2024 జూలై 24 కంటే ముందు నిర్మించిన నివాసాలు, అనుమతులు తీసుకున్న వాణిజ్య సముదాయాల జోలికి హైడ్రా వెళ్లదని ఆయన చెప్పారు.

**మతి తప్పి మాట్లాడుతున్నడు: ఆది శ్రీనివాస్**

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. మర్యాదస్తుడనుకుంటే.. మతి తప్పి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. తన పార్టీలో పదవుల కోసం సీఎం రేవంత్‌రెడ్డిపై దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. 'బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలంటే పార్టీ అధిష్ఠానాన్ని కాకా పట్టుకోవాలే కానీ.. మా సీఎం రేవంత్‌ను తిడితే పదవి వస్తుందనుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనం. ఈటల నీచ భాషను ఆపకపోతే.. మేం ఆ భాషలోకే దిగా ల్సి వస్తుంది' అంటూ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# పెట్టుబడుల రక్షణే కీలకం



భారత-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రస్తుతానికి చల్లారినట్టే కనిపిస్తున్నాయి. అయితే ఇవి పూర్తిగా సమసిపోవాలంటే మరికొంత సమయం పడుతుంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ భయాలు...

**ఉద్రిక్తతల నేపథ్యంలో ఆచితూచే ధోరణి బెస్ట్**

భారత-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రస్తుతానికి చల్లారినట్టే కనిపిస్తున్నాయి. అయితే ఇవి పూర్తిగా సమసిపోవాలంటే మరికొంత సమయం పడుతుంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ భయాలు అలానే ఉన్నాయి. అమెరికా సుంకాలను తాత్కాలికంగా వాయిదా వేయటంతో కొన్ని రోజులు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో సాగాయి. అయితే భారత్-పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలతో మరోసారి మార్కెట్లు ఆటుపోట్లలో సాగుతున్నాయి. పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతుండటంతో మదుపరుల్లో ఇంకా ఆందోళనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణకు ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తే మంచిదో తెలుసుకుందాం.

**మల్టీ అసెట్ విధానం**

గుడ్లన్నీ ఒకే బుట్టలో పెట్టకూడదంటారు. పెట్టుబడులకు ఈ సూత్రం చక్కగా వర్తిస్తుంది. అనిశ్చిత పరిస్థితులు, యుద్ధ సమయాల్లో ఇది మరింతగా వర్తిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మదుపరులు తమ పెట్టుబడులను ఏదో ఒక ఆస్తికే పరిమితం చేయకుండా ఈక్విటీ, బంగారం, రియల్ ఎస్టేట్, స్థిర ఆదాయాన్ని ఇచ్చే మంచి పరపతి రేటింగ్ ఉన్న రుణ పత్రాల వంటి వివిధ ఆస్తులకు (మల్టీ అసెట్) విస్తరించడం మంచిది. అందులో ఒక ఆస్తి నష్టపోయినా.. మిగతా వాటిలో ఏదో ఒకటి ఆదుకుని పెట్టుబడులకు రక్షణగా ఉంటుంది. వీటిని ఒక్కొక్కటి విడిగా కొనలేమనుకుంటే మంచి పనితీరు కనబరుస్తున్న మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే మల్టీ అసెట్ ఫండ్స్‌ను ఎంచుకోవటం మంచిది.

**స్మాల్,మిడ్ క్యాప్స్‌కు దూరంగా ఉంటే బెటర్**

ఒకవేళ ఈక్విటీకే పరిమితం కావాలనుకుంటే మీ పోర్టుఫోలియో నుంచి స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లను తప్పించటం మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ కంపెనీల షేర్లు ఇటీవలి కాలంలో బాగా దిద్దుబాటుకు లోనయ్యాయి. అయినా వీటి వాల్యుయేషన్స్ ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. వీటికి బదులు దేశీయ వినియోగ ఆధారిత లార్జ్‌క్యాప్ ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్ల లో మదుపు చేయడం మంచిది. మార్కెట్ ప్రతి పతనంలో నూ మదుపరులు ఈ షేర్లలో పొజిషన్లు తీసుకోవచ్చని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. యుద్ధం వచ్చినా, ఎలాంటి అనిశ్చిత పరిస్థితులున్నా ఈ కంపెనీల వ్యాపార వృద్ధి మెరుగ్గానే ఉంటుంది. ఈ కంపెనీల షేర్లు భారీ లాభాలు ఇవ్వకపోయినా పెట్టుబడులకు మాత్రం రక్షణ ఉంటుంది. ఇదే సమయంలో ఐటీ, బ్యాంకింగ్ రంగంలోని స్టాక్స్ పైనా మదుపరులు కన్నేయవచ్చంటున్నారు.

**బులియన్**

అంతర్జాతీయంగా, దేశీయంగా ఎలాంటి పరిస్థితులున్నా పెద్దగా రిస్క్ లేకుండా పెట్టుబడుల రక్షణ కోరుకునే మదుపరులు బంగారాన్ని ఆశ్రయించవచ్చు. గత ఏడాది పసిడి మదుపరులకు 30 శాతం వరకు లాభాలు పంచింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు చూసినా 20 శాతంపైనే పెరిగింది. దేశీయ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పసిడి ధర ఒక దశలో రూ.లక్ష దాటింది. ప్రస్తుతం రూ.లక్ష దిగువన ఉన్నా త్వరలోనే మళ్లీ ఆ స్థాయిని మించిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 3,350 డాలర్లకు చేరువలో ఉంది. ఈ ఏడాది చివరి నాటికి 4,000 డాలర్లకు చేరే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. అదే జరిగితే పసిడి ధర మరింత భగ్గుమనే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్దగా రిస్క్ తీసుకోలేని మదుపరులు తమ పెట్టుబడుల రక్షణ కోసం నేరుగా బంగారం, వెండి కొనిపెట్టుకోవచ్చు. లేదంటే డిజిటల్ రూపంలో లభించే సావరిన్ గోల్డ్ బాండ్స్, గోల్డ్ ఈటీఎఫలు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్టర్లు మదుపు చేయడం మంచిది.

**స్థిర ఆదాయ పథకాలు**

ఏ మాత్రం నష్టభయం (రిస్క్) భరించలేని మదుపరులు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు స్థిరమైన ఆదాయాన్ని అందించే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 'ట్రిపుల్ ఏ' పరపతి రేటింగ్ ఉన్న కంపెనీల రుణ పత్రాలు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో మదుపు చేయడం మంచిది. వీటిపై రాబడులు తక్కువగా ఉన్నా, అసలు, వడ్డీ చెల్లింపులకు ఢోకా ఉండదు. కంపెనీల కంటే.. ప్రభుత్వ రుణ పత్రాలు మేలు. ఇవన్నీ ఎందుకనుకుంటే మ్యూచువల్ ఫండ్స్ అందించే డెట్ ఫండ్స్‌లో మదుపు చేయడం బెటర్.

**ఎగుమతి ఆధారిత కంపెనీలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లన్నీ చెప్పుకోదగ్గ స్థాయిలో దిద్దుబాటుకు లోనయ్యాయి. భారత్-బ్రిటన్ మధ్య ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. భారత్-అమెరికా మధ్యన త్వరలోనే ఎఫ్‌టీఏ కుదిరే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు అమెరికా, ఈయూ, జపాన్ వంటి దేశాలు అనుసరిస్తున్న చైనా+1 విధానం మన దేశానికి కలిసి రానుంది. దీంతో ఎగుమతి ఆధారిత టెక్స్‌టైల్, లెదర్, ఇంజనీరింగ్, ఆటోమొబైల్ విడిభాగాలు, ఫార్మా, ఐటీ కంపెనీల షేర్ల ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. కొద్దిపాటి రిస్క్‌కు సిద్ధమైన మదుపరులు ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలోనూ ఈ కంపెనీల షేర్లలో పొజిషన్లు తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు.

**తగ్గుతున్న వడ్డీ రేట్లు**

యుద్ధ వాతావరణం ఉన్నా మన దేశంలోనూ వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. ఆర్‌బీఐ ఇప్పటికే కీలక రెపో రేటును అర శాతం తగ్గించింది. ఈ ఏడాది చివరికల్లా మరో అర శాతం తగ్గించే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఈఎంఐల చెల్లింపుల భారం తగ్గనుంది. దీనికి తోడు కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను రాయితీలతో ప్రజల చేతుల్లోకి రూ.లక్ష కోట్ల అదనపు నిధులు రానున్నాయి. ఇందులో ఎక్కువ భాగం ఖర్చులు, పొదుపు రూపంలో తిరిగి మార్కెట్లోకి రానున్నాయి. ఇవన్నీ మన స్టాక్ మార్కెట్‌కు మేలు చేస్తాయి.

# ఎప్పుడు పడితే అప్పుడు తినొద్దు

ఆహారం విషయంలో మీరు ఏం తింటున్నారనే దానిలాగే, ఎప్పుడు తింటున్నారనేది కూడా అతి ముఖ్యమైన అంశం. మీ శరీర సహజ స్పందనలకు అనుగుణంగా మీ తిండివేళలు అనుసంధానమై ఉంటాయి. దీన్ని క్రోనోన్యూట్రిషన్ అని పిలుస్తారు. దీన్ని గమనింపులో ఉంచుకుంటే ఆహారం ద్వారా దక్కే ప్రయోజనాలను గరిష్ఠం చేసుకోవచ్చని పోషకాహార నిపుణుల మాట. వివిధ షిఫ్టుల్లో పనులు, యాప్స్ ద్వారా ఎప్పుడంటే అప్పుడే ఆహారం లభ్యం కావడం వల్ల నిర్ణీత వేళల్లో తినే విధానం ఇప్పుడు బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో క్రోనోన్యూట్రిషన్ గురించి తెలుసుకోవడం తప్పనిసరి.

మీరు తినే వేళలకు అనుగుణంగానే మీ శరీరాల్లో హార్మోన్ల విడుదల, నిద్రించడం, మేల్కొనడం, జీవక్రియల క్రమబద్ధీకరణ ఆధారపడి ఉంటాయి.

క్రోనోన్యూట్రిషన్‌లో ప్రధాన అంశం ఏంటంటే%ొ% ఉదయం వేళల్లో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవాలి. దీంతో రక్తంలో గ్లూకోజ్ స్థాయులు అదుపులో ఉంటాయి. అలా డయాబెటిస్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది. అదే రాత్రి వేళల్లో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా తీసుకుంటే శరీరంలో గ్లూకోజ్‌కు సంబంధించిన జీవక్రియల మీద ప్రభావం పడుతుంది. బరువు పెరగడానికి దారి తీస్తుంది.

**క్రోనోన్యూట్రిషన్ ప్రయోజనాలు**

ఉదయం వేళల్లో ఎక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. శరీర జీవ గడియారాన్ని అనుసరించి జీర్ణవ్యవస్థ పనిచేస్తుంది. వేళాపాళా లేకుండా తింటే ఆహారం జీర్ణమయ్యే క్రమం దెబ్బతింటుంది. జీర్ణ సమస్యలు వస్తాయి. సమయానికి తింటే జీర్ణక్రియ సాఫీగా సాగిపోతుంది. మీ తిండి వేళలు నిద్రా చక్రం మీద కూడా ప్రభావం చూపుతాయి. రాత్రిళ్లు అతిగా తింటే నిద్రలో అసౌకర్యం కలుగుతుంది. కాబట్టి నిద్రించడానికి రెండు మూడు గంటల ముందే తినేయాలి.

**చిట్కాలు**

ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ముతకధాన్యాలతో కూడిన ఉపాహారంతో రోజు ప్రారంభించాలి.నియమిత వేళల్లోనే తినాలి. రోజులో ఏదో ఒకసారి మాత్రమే సుష్టుగా భోజనం చేయాలి.

ప్రతిరోజూ ఒకే భోజన సమయాలను కొనసాగించాలి.రాత్రి భోజనం తర్వాత సాధ్యమైనంత వరకు ఇక తినకూడదు. ఒకవేళ తినాలనుకుంటే తేలికగా అరిగిపోయే వాటిని ఎంచుకోవాలి. రాత్రివేళ మరీ ఆలస్యంగా తినకూడదు.మీ శరీర హెచ్చరికలకు అనుగుణంగా భోజన విధానాన్ని అలవాటు చేసుకోవాలి. వేళాపాళా లేకుండా తింటే అది మీ ఆరోగ్యం మీద దుష్ప్రభావం చూపుతుంది.

**సరైన వేళలో**


నాణ్యమైన పోషకాహారం తీసుకోవడం మాత్రమే సరిపోదు.. దాన్ని సరైన వేళలో తీసుకోవాలనేది క్రోనోన్యూట్రిషన్ ప్రాథమిక సూత్రం. ఇలా చేస్తేనే మీ శరీర జీవక్రియలు, బరువు నిర్వహణ, జీర్ణవ్యవస్థ ఆరోగ్యం, నిద్ర అన్నీ సవ్యంగా సాగిపోతాయి.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 మే 2025








## హాజిల్‌వుడ్‌కు గాయం

### తిరిగి రావడం కష్టమే!.. ఆర్‌సీబీకి ఎదురుదెబ్బ

బెంగళూరు: ఐపీఎల్-18లో సమిష్టి ప్రదర్శనతో టైటిల్ రేసులో ఒకటిగా ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు ఎదురుదెబ్బ తగిలింది. టోర్నీలో ఇప్పటివరకూ బెంగళూరు విజయాల్లో కీలకపాత్ర పోషించిన స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ గాయంతో టోర్నీ మొత్తానికి దూరమవనున్నట్టు తెలుస్తున్నది. ఈనెల 3న చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌కు ముందు భుజం గాయంతో తప్పుకున్న హాజిల్‌వుడ్.. బీసీసీఐ ఈ లీగ్‌ను వారం రోజుల పాటు వాయిదా వేయడంతో ఆస్ట్రేలియాకు వెళ్లిపోయాడు. ఈ ఆసీస్ పేసర్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోకపోగా వచ్చేనెలలో ఆ జట్టు.. దక్షిణాఫ్రికాతో కీలకమైన వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆడనున్న నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అతడిపై రిస్క్ తీసుకోదలుచుకోకూడదన్న అభిప్రాయంలో ఉంది. దీంతో అతడు తిరిగి రావడం కష్టమేనని ఆర్‌సీబీ వర్గాలు చెబుతున్నాయి.




## చివరి నిమిషంలో విమానం దిగిన పంజాబ్ కోచ్ పాంటింగ్..

భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. దీంతో చాలా మంది విదేశీ ఆటగాళ్లు, సహాయక సిబ్బంది తమ తమ స్వస్థలాలకు పయనమయ్యారు. అయితే పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ మాత్రం శనివారం వరకు భారత్‌లోనే ఉన్నాడు. ఇక, ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టేలా లేవని భావించి ఆస్ట్రేలియాకు వెళ్లిపోదామనుకున్నాడు. శనివారం సాయంత్రం ఆస్ట్రేలియా విమానం ఎక్కడానికి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నాడు. రికీ పాంటింగ్ ఢిల్లీలో విమానం ఎక్కిన తర్వాత కాల్పుల విరమణకు సంబంధించిన ప్రకటన వెలువడింది. దీంతో పాంటింగ్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా విమానం దిగిపోయాడు. ఢిల్లీలోనే ఉండాలని నిర్ణయించుకున్నాడు. అంతేకాదు పంజాబ్ జట్టుకు చెందిన విదేశీ ఆటగాళ్లను కూడా స్వదేశాలకు వెళ్లకుండా ఆపాడు. పంజాబ్ జట్టు తరఫున ఆడుతున్న మార్కస్ స్టోయినిస్, జాష్ ఇంగ్లీస్, బార్ట్‌లెట్, ఆరోన్ హార్డీ తమ స్వదేశాలకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. వారి ప్రయాణం గురించి తెలుసుకున్న పాంటింగ్ వారితో మాట్లాడాడు. కాల్పుల విరమణ గురించి చెప్పి వారిలో ధైర్యం నింపాడు. వారు భారత్‌లోనే ఉండేలా ఒప్పించాడు. ఈ విషయాన్ని పంజాబ్ కింగ్స్ వర్గాలు ధ్రువీకరించాయి. అయితే పంజాబ్ జట్టులో కీలక ఆటగాడైన మార్కోస్ యన్‌సెన్ (దక్షిణాఫ్రికా) మాత్రం దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి తన స్వదేశానికి వెళ్లిపోయాడు. అతడు తప్ప మిగిలిన ఆటగాళ్లందరూ పంజాబ్ జట్టుతోనే ఉన్నారు.

# టెస్ట్‌లకు గుడ్‌బై చెప్పనున్న కోహ్లీ

### బీసీసీఐకి సమాచారం ఇచ్చిన స్టార్ బ్యాటర్? నేడో రేపో అధికారిక ప్రకటన




న్యూఢిల్లీ: ఏడాదిలో భారత క్రికెట్‌లో ఎన్ని అనూహ్య పరిణామాలో! నిరుడు జూన్‌లో టీమిండియా టీ20 ప్రపంచ కప్ గెలిచింది. ఆ వెంటనే దిగ్గజ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా పొట్టి క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశారు. అలా ఏడాది గడుస్తున్నదో లేదో..తిరిగి వరుస సంచలనాలు చోటు చేసుకుంటున్నాయి. మొన్నటికి మొన్న కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించి దేశ క్రికెట్ వర్గాలను, ఫ్యాన్స్‌ను షాక్‌లోకి నెట్టాడు. ఆ విషయాన్ని ఇంకా జీర్ణించుకోలేకపోతున్న అభిమానులకు మరో విస్మయకర వార్త ఇది! స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా టెస్ట్‌లనుంచి వైదొలగనున్నాడనేదే ఆ వార్త. ఈమేరకు విషయాన్ని విరాట్ బీసీసీఐ పెద్దలకు తెలియజేసినట్టు విశ్వసనీయ సమాచారం. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీసలో భారత్ తలపడనుంది. ఇప్పటికే రోహిత్ తప్పుకోగా, ఇప్పుడు కోహ్లీ కూడా అదే బాటలో పయనిస్తే..ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప కొత్త సైకిల్ (2025-27) ఆరంభ సిరీసలో భారత్ అవకాశాలపై ప్రభావం పడుతుందని బోర్డు పెద్దలు ఆందోళన చెందుతున్నారట. దీంతో రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని వారు కోహ్లీని కోరినట్టు సమాచారం.

**అప్పుడే నిర్ణయానికొచ్చేశాడా ?:**

సుదీర్ఘ ఫార్మాట్‌కు బై చెప్పాలని ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్ ముగిసిన వెంటనే విరాట్ నిర్ణయించేసుకున్నాడట. 'ఐదు టెస్ట్‌ల ఆ సిరీసలో కోహ్లీ ఒక సెంచరీ మినహా..పెద్దగా పరుగులు చేయలేదు. పేలవ ప్రదర్శన దరిమిలా వచ్చిన విమర్శలతో టెస్ట్‌ల నుంచి విరమించుకోవాలని కోహ్లీ నిర్ణయం తీసుకున్నాడు. అయితే ఇంగ్లండ్‌తో కీలకమైన సిరీసలో భారత్ తలపడాల్సి ఉండడంతో రిటైర్మెంట్ నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలని విరాట్‌ను కోరాం. కానీ బోర్డు అభ్యర్థనపై అతడు స్పందించలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు శనివారం వెల్లడించాడు.

**ఎంతోకాలంగా పేలవ ఫామ్:**

కోహ్లీ చాలాకాలంగా టెస్ట్‌ల్లో అంతగా ప్రభావం చూపలేకపోతున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ తొలి టెస్ట్‌లో అతడు శతకం సాధించాడు. దాంతో విరాట్ ఫామ్ గాడిలో పడినట్టేనని అంతా భావించారు. అయితే తదుపరి నాలుగు టెస్ట్‌లలో విఫలమయ్యాడు. ఫలితంగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను అతడు అత్యంత పేలవంగా 23.75 సగటుతో ముగించాడు. కోహ్లీ వైఫల్యం ఆ ఒక్క సిరీసకే పరిమితం కాలేదు. అంతకుముందు ఐదేళ్లలో 37 టెస్ట్‌లు ఆడిన విరాట్ 3 సెంచరీలతో 1990 పరుగులే చేశాడు. కెరీర్‌లో ఇప్పటిదాకా 123 టెస్ట్‌లు ఆడిన కోహ్లీ 46.85 సగటుతో 9230 రన్స్ సాధించాడు.

**ఐపీఎల్‌లో అదుర్స్:**

బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో విఫలమైనా..ఈసారి ఐపీఎల్‌లో మాత్రం విరాట్ దుమ్ము రేపుతున్నాడు. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల్లో 500కు పైగా రన్స్ చేయడంతో అతడిలో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. ఈ ఫామ్‌ను కొనసాగిస్తూ ఇంగ్లండ్‌తో రాబోయే టెస్ట్ సిరీసలో రాణిస్తాడని అతడి ఫ్యాన్స్ గంపెడాశతో ఉన్నారు.

**సచిన్ మాత్రమే ఆపగలడు!**

రిటైర్మెంట్ నిర్ణయంపై పునరాలోచన చేయాలని బోర్డు పెద్దలు అడిగినా విరాట్ స్పందించకపోవడంతో.. ఇక అతడి మనసు మార్చగలిగేది సచిన్ టెండూల్కరేనని భావిస్తున్నారు. కారణం..సచిన్‌ను కోహ్లీ తన ఆరాధ్య క్రికెటర్‌గా భావిస్తుండడమే. రిటైర్మెంట్ నిర్ణయమనేది ఆ ఆటగాడి వ్యక్తిగతం. దానిని ఎవరూ కాదనలేరు. కానీ ప్రస్తుతం యువ క్రికెటర్లతో నిండి ఉన్న భారత టెస్ట్ జట్టుకు మైదానంలో మార్గనిర్దేశం చేయాలంటే విరాట్ లాంటి అపార అనుభజ్ఞుడి అవసరమనేది వాదన.

**ప్లీజ్..వద్దు!**

టెస్ట్‌లకు కోహ్లీ అప్పుడే గుడ్‌బై చెప్పొద్దని భారత జట్టు మాజీ ఆటగాడు అంబటి రాయుడు అన్నాడు. 'విరాట్ ప్లీజ్.. రిటైర్ కావొద్దు. గతంకంటే ఎక్కువగా భారత జట్టుకు నీ అవసరం ఉంది. అయినా నీలో ఇంకా ఎంతో ఆడే సామర్థ్యముంది' అని ఎక్స్ ద్వారా రాయుడు సూచించాడు.

# ఐపీఎల్ ఆడాలని మా క్రికెటర్లను ఒత్తిడి చేయం.. ఆస్ట్రేలియా బోర్డు..!




CRICKET AUSTRALIA

ఐపీఎల్ 18వ సీజన్ త్వరలోనే తిరిగి ప్రారంభం కానుండడం అభిమానులకు తీపి కబురే. కానీ, కొన్ని జట్లు మాత్రం కీలక ఆటగాళ్ల సేవల్ని కోల్పోయే అవకాశముంది. ముఖ్యంగా విదేశీ క్రికెటర్లు తదుపరి మ్యాచుల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నడుమ ఆర్సీబీ, పంజాబ్, ఢిల్లీ జట్లకు చెందిన ప్లేయర్లు తమ దేశాలకు వెళ్లిపోయారు. ఇప్పుడు ఇండో -పాక్ కాల్పుల విరమణ ( % జ వ ఖ ం వ ట ఱ తీ వ % ) క్ ు అంగీకరించడంతో తదుపరి మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ సిద్ధమవుతోంది.

మే 16వ తేదీ నుంచి లీగ్‌ను పునరుద్ధరించాలని బీసీసీఐ భావిస్తోంది. అయితే.. ఇప్పటికే సొంత దేశాలకు వెళ్లిపోయిన క్రికెటర్లకు ఆయా బోర్డులు అనుమతి ఇస్తాయా? అనేది తెలియాల్సి ఉంది. ఐపీఎల్ పునరుద్ధరణ నేపథ్యలో క్రికెట్ ఆస్ట్రేలియా (%జతీఱషఌవ్ ూాబర్‌త్ఖుశ్రీఖు%) ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'ఐపీఎల్ 18వ సీజన్‌లో ఆడుతున్న మా క్రికెటర్లు సురక్షితంగా స్వదేశం చేరుకున్నారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో వాళ్లను ఐపీఎల్ ఆడాల్సిందిగా మేము ఒత్తిడి చేయం. ఒకవేళ వాళ్లు భారత్‌కు వెళ్లేందుకు సిద్ధపడకుంటే వాళ్ల నిర్ణయాన్ని మేము గౌరవిస్తాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. పేసర్ మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోయినిస్‌తో పాటు పలువురు ఆసీస్ ఆటగాళ్లు ఆదివారం సొంత గడ్డపై అడుగుపెట్టారు. ఒకవేళ ఆస్ట్రేలియా ప్లేయర్లు రిటర్న్ రాకుంటే.. తొలి టైటిల్‌పై కన్నేసిన ఆర్సీబీ, ఢిల్లీ, పంజాబ్ జట్లకు గట్టి ఎదురుదెబ్బ తగలడం ఖాయం. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ఆస్ట్రేలియా బోర్డు తమ ఆటగాళ్ల భద్రత గురించి ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

**మే 16, 17 నుంచి**

సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేస్తున్నట్టే మే 9న బీసీసీఐ ప్రకటించింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే లీగ్‌ను మొత్తానికే రద్దు చేయడం లేదా దక్షిణాది రాష్ట్రాల్లో నిర్వహించాలని భారత బోర్డు భావించింది. అయితే.. మే 10న ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

దాంతో, మే 16, 17 నుంచి లీగ్‌ను జరిపేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఇదే విషయమై ఐపీఎల్ ఫ్రాంచైజీలకు సమాచారాన్ని ఇచ్చింది బీసీసీఐ. హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1, కోల్‌కతాలో క్వాలిఫయర్ 2 జరిగే అవకాశముంది. మే 30 లేదా జూన్ 1 నిర్వహించే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది.



## సీతమ్మ జీవితాన్నే మార్చేసిన ఘటన!


మృణాల్ ఠాకూర్ అలియాస్ సతీమ కెరీర్ దేదీప్యమానంగ సాగిపోతున్న సంగతి తెలిసిందే. 'సీతారామం' సక్సెస్ తర్వాత గ్యాప్ వచ్చినా? వరుస ప్రాజెక్ట్ లతో ఒక్కసారిగా బిజీ అయింది. ప్రస్తుతం బాలీవుడ్ లోనే ఐదారు సినిమాలు చేస్తోంది. ఇందులో 'డెకాయిట్' చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీలోనూ తెరకెక్కిస్తున్నారు. తెలుగులో అవకాశాలు వస్తున్నా? కథలు నచ్చకపోవడంతో అంగీకరించడం లేదు. అలా చాలా ప్రాజెక్టులే వదులుకుంది. పారితోషికంతో పనిలేకుండా కేవలం కథాబలం...సవాల్ విసిరే పాత్రలే కావాలం టోంది. కథల విషయంలో అంత బలంగా నిలబడింది కాబట్టే సక్సెస్ లు అందుకుం టుంది. అయితే నటిగా ఇంత బిజీ అవ్వడానికి కారణమైన కెరీర్ మూలాలను మృణాల్ మరోసారి గుర్తు చేసుకుంది. నటన పట్ల తనకు ఉత్సాహం ఉన్నా? దాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో తెలియక చాలా ఇబ్బంది పడిందిట. తన కలను ఎలా స్వీకరిస్తారో తెలియక తనలో ఫ్యాషన్ ను గురించి ఎప్పుడూ కుటుంబ సభ్యులతో పంచు కోలేదుట. అనుకోకుండా ఓ రోజు ఓ స్నేహితురాలు మరాఠీ షో ఆడిషన్ గురించి చెప్పడంతో అక్కడ పాల్గొందిట. మరాఠీ మాతృ భాష కావడంతో పెర్ఫార్మెన్స్ తో ఇరగదీసిందట. ఆ సక్సెస్ ఓపాత్రను తెచ్చి పెట్టిందదంది. నటన ప్రయాణంలో తొలి అడుగు పడేలా చేసిందదంది. కెరీర్ లో ఎంతో మంది ప్రేక్షకుల ప్రేమను పొందడానికి కారణమైన ఆ క్షణాలు ఎప్పటికీ ప్రత్యేకమని గుర్తు చేసుకుంది. మృణాల్ తొలు మరాఠీలో 'హలో నందన్' అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా రిలీజ్ అయిన నాలుగేళ్లకు లవ్ సోనియాతో బాలీవుడ్ లో అడుగు పెట్టింది. తెలుగులో సీతారామంతో స్టార్ హీరోయిన్ గా వెలిగిపోయింది.

## ప్రేమలు బ్యూటీకి మరో బంపర్ ఆఫర్..!



మలయాళ భామ మమితా బైజు ప్రేమలు సినిమాతో సౌత్ లో సూపర్ క్రేజ్ ని తెచ్చుకుంది. ప్రేమలు ఒక రెగ్యులర్ లవ్ స్టోరీనే కానీ అందులో నటించిన మమితా తన క్యూట్ లుక్స్, ఎక్స్ ప్రెషన్స్ తో యువత హృదయాలను దోచేసింది. ప్రేమలు బ్యూటీకి వచ్చిన ఈ క్రేజ్ ని క్యాష్ చేసుకోవాలని దర్శక నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్ లో మమితా బైజుకి ఉన్న ఫ్యాన్స్ దృష్టిలో ఉంచుకుని ఆమెను ఇక్కడ సినిమాల్లో తీసుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే మాస్ మహరాజ్ రవితేజ సినిమాలో మమితా నటిస్తుందని తెలుస్తుంది. కిశోర్ తిరుమల డైరెక్షన్ లో చేస్తున్న అనార్కలి సినిమాలో మమితా బైజు నటిస్తుందని టాక్. ఈ సినిమాలో కయదు లోహార్ కూడా మరో హీరోయిన్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఐతే ఈ సినిమాతో పాటుగా మమితా టాలీవుడ్ లో మరో బంపర్ ఆఫర్ అందుకుందని ఫిల్మ్ నగర్ టాక్. తెలుగులో ఒక క్రేజీ సినిమాలో హీరోయిన్ గా మమితాని ఓకే చేశారట. క్రేజీ హీరో స్టార్ డైరెక్టర్ కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉ ంటుందని తెలుస్తుంది. మమితా కూడా స్టోరీ వినగానే కనెక్ట్ అయ్యిందట. తెలుగులో ఎప్పటి నుంచో నటించాలని ఉన్నా సరైన కథ దొరక్క సైలెంట్ గా ఉంది మమితా బైజు. ఐతే ఇప్పుడు అమ్మడు వరుస తెలుగు సినిమాలు చేసేందుకు రెడీ అయ్యింది. రవితేజ సినిమాలో మంచి రోల్ చేస్తుందని తెలుస్తుండగా ఈ సినిమాతో పాటు మరో కొత్త సినిమాకు లాక్ అయినట్టు తెలుస్తుంది.

స్క్రీన్ మీద మమితా క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ కుర్రాళ్లను గిలిగింతలు పెట్టిస్తుంది. అందుకే యూత్ లో ఆమెకు ఉన్న ఈ క్రేజ్ ని పర్ఫెక్ట్ గా వాడుకోవాలని చూస్తున్నారు. మమితా బైజు తెలుగుతో పాటుగా తమిళ్, మలయాళ సినిమాల్లో రాణిస్తుంది. ప్రస్తుతం అమ్మడు దళపతి విజయ్ జన నాయగన్ లో కూడా ఇంపార్టెంట్ రోల్ చేస్తుంది. ఆ సినిమాలో పూజా హెగ్డే కూడా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సౌత్ లో తన మార్క్ నటనతో ఆకట్టుకుంటున్న మమితా తెలుగులో బిజీ హీరోయిన్ గా ఛాన్స్ లు అందుకోవాలని చూస్తుంది. ప్రేమలుతో ఆల్రెడీ మమితాకు తెలుగు ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. సో రాబోయే సినిమాలు కూడా ఆమె అదరగొట్టేస్తుందని ఫిక్స్ అయ్యారు.



## నటనారంగేట్రంపై సారా టెండూల్కర్ ట్విస్ట్

క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ బాలీవుడ్ ఆరంగేట్రం గురించి చాలా కాలంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. సినీ సెలబ్రిటీలతో అత్యంత సన్నిహితంగా వ్యవహరించే సారా టెండూల్కర్ కథానాయికగా ఆరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉందని కథనాలొచ్చాయి. కానీ దీనిపై సచిన్ కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. తాజాగా వోగ్ ఇండియాతో ప్రత్యేక సంభాషణలో సారా టెండూల్కర్ స్వయంగా తన తెరంగేట్రం గురించి ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. సారా తాజా ఇంటర్వ్యూలో తనను నటించాల్సిందిగా ఎవరైనా కోరితే దానిని తిరస్కరిస్తున్నానని సారా టెండూల్కర్ వెల్లడించింది. "నేను అంతర్ముఖురాలిని... కెమెరాలు నన్ను భయపెడుతున్నాయి" అని సారా వెల్లడించింది. ఆ వృత్తికి న్యాయం చేయలేనని భావిస్తున్నాను. నటన నాకు సంతృప్తి కంటే ఎక్కువ ఆందోళనను ఇస్తుంది. అందుకే అవకాశాలు వచ్చినా తిరస్కరిస్తున్నాను.. అని తెలిపింది. తాను నటనలోకి రాలేనని సారా అధికారికంగా వెల్లడించింది. ఫ్యాషన్ షూట్‌లు, బ్రాండ్స్ ప్రచారాలలో దూకుడుగానే ఉన్న సారా నటనను కెరీర్ గా ఎంచుకునే ఆలోచనతో లేదని తన మాటల్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. తనకు ప్రజాదరణ, అసాధారణమైన బ్యాకింగ్ ఉన్నప్పటికీ తాను స్టార్‌డమ్‌ను ఆశించడం లేదని సారా స్పష్టంగా చెప్పింది. నేను ఫ్యాషన్, అందం, లైఫ్ స్టైల్ వంటి వృత్తులలో కూడా పని చేస్తాను. నేను ప్రామాణికమైనది అనిపించేటిని మాత్రమే తీసుకుంటాను.. ప్రతిదానికీ అవుననలేను! అని సారా అంది. యూనివర్శిటీ ఆఫ్ కాలేజ్ లండన్ లో బయో మెడికల్ సైన్సెస్‌లో బ్యాచిలర్ అండ్ క్లినికల్ న్యూట్రిషన్, పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసిన సారా వైద్యవృత్తిలో కౌన్సిలింగ్ కెరీర్ పైనా దృష్టి సారించనుంది. ఇప్పుడు సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆరోగ్యం, పోషకాహారం వంటి అంశాలపై తనవంతు సేవాకార్యక్రమాల్లోను పాల్గొంటోంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986